7

సాక్షి
కుమురం భీం

సోమవారం, 19 ఆగస్టు 2024

న్యూస్‌రీల్

గేట్లు ఎత్తివేత



'వట్టివాగు' నుంచి దిగువకు పోతున్న నీరు

ఆసిఫాబాద్‌రూరల్: ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలతో జిల్లాలోని ప్రధాన ప్రాజెక్టుల్లోకి వరద చేరుతోంది. ఆదివారం వట్టివాగు, కుమురంభీం(అడ) ప్రాజెక్టుల గేట్లు ఎత్తి నీటిని కిందికి వదిలారు. వట్టివాగు ప్రాజెక్టు నీటి మట్టం 241 మీటర్లు కాగా.. ప్రస్తుతం 239.5 మీటర్లకు చేరింది. ఇన్‌ఫ్లో 840 క్యూసెక్కులు ఉండటంతో రెండు గేట్లు 0.2 మీటర్లు ఎత్తి 720 క్యూసెక్కుల నీటిని దిగువకు వదులుతున్నారు. అడ ప్రాజెక్టు నీటిమట్టం 243 మీటర్లు కాగా.. ప్రస్తుతం నీటిమట్టం 237.8 మీటర్లుగా ఉంది. ఇన్‌ఫ్లో 813 క్యూసెక్కులు కాగా.. ఒక గేటు 0.2 మీటర్లు ఎత్తి 431 క్యూసెక్కుల నీటిని కిందికి వదులుతున్నారు. దిగువ ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ప్రాజెక్టు అధికారులు సూచించారు.

'నిర్లక్ష్యంతోనే గని ప్రమాదాలు'

రెబ్బెన(ఆసిఫాబాద్): అధికారులు, సింగరేణి యాజమాన్యం నిర్లక్ష్యంతోనే గని ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి బోగే ఉపేందర్ ఆరోపించారు. గోలేటి సీహెచ్‌పీలో శనివారం బెల్ట్ క్లీనింగ్ చేస్తుండగా ప్రమాదవశాత్తు గాయపడిన కాంట్రాక్టు కార్మికుడు మల్లేశ్‌ను ఆదివారం పరామర్శించారు. ప్రమాదం జరిగిన తీరును తెలుసుకున్నారు. ఉపేందర్ మాట్లాడుతూ పర్మినెంట్ కార్మికులతో చేయించాల్సిన పనిని సింగరేణి అధికారులు కాంట్రాక్టు వారితో చేయిస్తున్నారని ఆరోపించారు. అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ కాంట్రాక్టు కార్మికుల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారన్నారు. ఈ తరహాలోనే శనివారం సీహెచ్‌పీలో బంకర్ వద్ద కార్మికుడికి గాయాలయ్యాయని పేర్కొన్నారు. ప్రమాదానికి కారకులైన అధికారులపై చర్యలు తీసుకోవాలని, బాధితుడికి మెరుగైన వైద్యం అందించి కోలుకునే వరకు ఆన్‌డ్యూటీగా పరిగణించాలని డిమాండ్ చేశారు. కార్మిక సంఘం నాయకులు సాగర్, రాజశేఖర్ పాల్గొన్నారు.

క్రీడాకారులకు బహుమతులు ప్రదానం



క్రీడాకారులకు బహుమతులు, ప్రశంసాపత్రాలు అందిస్తున్న అధికారులు

రెబ్బెన(ఆసిఫాబాద్): గోలేటి టౌన్‌షిప్‌లోని సీఈఆర్ క్లబ్‌లో నిర్వహించిన ఐదో జిల్లాస్థాయి పోటీల్లో ప్రతిభ చూపిన క్రీడాకారులకు ఆదివారం బహుమతులు, ప్రశంసాపత్రాలు ప్రదానం చేశారు. రాష్ట్రస్థాయి పోటీలకు క్రీడాకారులను ఎంపిక చేశారు. ఈ సందర్భంగా తహసీల్దార్ రామ్మోహన్‌రావు, ఎంపీడీవో శంకరమ్మ మాట్లాడుతూ జిల్లాకు చెందిన క్రీడాకారులు రాష్ట్రస్థాయి యోగా పోటీల్లో ప్రతిభ కనబర్చాలన్నారు. జిల్లా యోగాసన స్పోర్ట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు కేసరి ఆంజనేయులు గౌడ్, ప్రధాన కార్యదర్శి కొలిపాక కిరణ్‌కుమార్, సంయుక్త కార్యదర్శి అలేఖ్య, రాష్ట్ర పరిశీలకులు మంద శ్రీనివాస్, ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఉపేందర్, నాయకులు నవీన్‌గౌడ్ పాల్గొన్నారు.

వార్డులు ఖరారు

- 20 వార్డులతో ఆసిఫాబాద్ మున్సిపాలిటీ
- సర్వే పారదర్శకంగా జరగలేదంటూ ఆరోపణలు
- ఈ నెల 20 వరకు అభ్యంతరాల స్వీకరణ
- 27న తుది జాబితా ప్రకటన



ఆసిఫాబాద్ మున్సిపల్ కార్యాలయం

ఆసిఫాబాద్: ఆసిఫాబాద్ మున్సిపాలిటీ విభజన ప్రక్రియ ఎట్టకేలకు పూర్తయింది. గత ఫిబ్రవరిలో ఆసిఫాబాద్, జన్కాపూర్, గొడవెల్లి గ్రామాలతో జిల్లా కేంద్రమైన ఆసిఫాబాద్‌ను మున్సిపాలిటీగా ఏర్పాటు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో మున్సిపల్, రెవెన్యూ సిబ్బంది సంయుక్తంగా సర్వే చేపట్టి హద్దులు గుర్తించారు. ఆసిఫాబాద్, జన్కాపూర్, గొడవెల్లి గ్రామాల పరిధిలో 20 వార్డులతో మున్సిపాలిటీ ఏర్పాటు చేశారు. గతేడాది ఫిబ్రవరిలో అసెంబ్లీలో మున్సిపాలిటీ ఏర్పాటు ప్రతిపాదనలకు గ్రీన్‌సిగ్నల్ లభించగా, ఏప్రిల్ 9న మున్సిపల్ బిల్లును రాష్ట్ర గవర్నర్ ఆమోదించడంతో ఆసిఫాబాద్ జిల్లా కేంద్రం పురపాలిక సంఘంగా రూపాంతరం చెందింది. 3,831 ఎకరాల విస్తీర్ణం(17.02 చదరపు కిలోమీటర్లు), 21,293 పైచిలుకు జనాభా కలిగిన ఆసిఫాబాద్ పురపాలిక సంస్థలో మొత్తం 20 వార్డులు ఏర్పాటు చేశారు. అభ్యంతరాల స్వీకరణకు ఈ నెల 20 వరకు అవకాశం ఇచ్చారు. ఈ నెల 27న తుది జాబితా ప్రకటిస్తామని మున్సిపాలిటీ అధికారులు వెల్లడించారు.

వార్డులు విభజన ఇలా..

జిల్లా కేంద్రంగా మారిన ఆసిఫాబాద్ పట్టణం గ్రామ పంచాయతీగా ఉండటంతో పరిపాలన పరంగా అనేక ఇబ్బందులు ఏర్పడ్డాయి. ప్రస్తుతం మున్సిపాలిటీ ఏర్పాటుకు వేగంగా అడుగులు పడుతుండటంతో అభివృద్ధికి ఆస్కారం ఏర్పడనుంది. ప్రస్తుతం 1వ వార్డులో జన్కాపూర్, సాలెగూడ ఉండగా.. 2వ వార్డులో దస్నాపూర్, 3వ వార్డులో దస్నాపూర్ మెయిన్ రోడ్, 4వ వార్డులో పైకాజీనగర్, 5వ వార్డులో బజార్‌వాడిలోని రహ్మద్‌నగర్, 6వ వార్డులో రావులవాడ, బాపూనగర్, గాంధీచౌక్, 7వ వార్డులో కంచుకోట, శివకేశవ మందిర్ రోడ్, 8వ వార్డులో తారకరామానగర్, గొడవెల్లి, గొడవెల్లి ఎస్సీ కాలనీ, 9వ వార్డులో కసాబ్‌వాడి, హీరాపూర్, 10వ వార్డులో సందీప్‌నగర్, సందీప్‌నగర్ ఎస్సీ కాలనీ, ఎస్పీ నగర్, 11వ వార్డులో సందీప్‌నగర్ పార్ట్, వీరముస్టి కాలనీ, 12వ వార్డులో గోండుగూడ, నూర్‌నగర్, మార్కండేయ కాలనీ, సందీప్‌నగర్, 13వ వార్డులో వైఎస్‌ఆర్ కాలనీ, ఆర్‌ఆర్ కాలనీ, 14వ వార్డులో జన్కాపూర్, 15వ వార్డులో ఐసీడీఎస్, ఉస్మానియా మజీద్, కోర్టు రోడ్, ఎన్‌జీవో కాలనీ, 16వ వార్డులో హడ్కోకాలనీ, కంఠ కాలనీ, 17వ వార్డులో బజార్‌వాడి పార్ట్, హడ్కో కాలనీ పార్ట్, 18వ వార్డులో ఖది మజీద్, మంగలివాడ, బనార్‌వాడ, మేకలవాడ, 19వ వార్డులో బ్రాహ్మణవాడ, బెస్తవాడ, 20వ వార్డులో బజార్‌వాడి ప్రాంతాలు ఉన్నాయి.

వాస్తవాలకు భిన్నంగా..

ఆసిఫాబాద్ మున్సిపాలిటీ, రాజంపేట గ్రామ పంచాయతీల విభజన ప్రక్రియ సమయంలో చేపట్టిన సర్వేలో వాస్తవాలు చూపకపోవడంపై స్థానికులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఏజెన్సీ ప్రాంతంలో రిజిస్ట్రేషన్లు జరగవు. మైదాన ప్రాంతాల్లోనే పక్కా పట్టాలున్న భూములకే రిజిస్ట్రేషన్లు జరిగాయి. గుండి రహదారిపై ఉన్న సర్వే 63, 64, 65 నంబర్లలోని ప్లాట్లు బందోబస్తు పట్టాలు ఉన్నాయి. మున్సిపాలిటీ నోటిఫికేషన్‌లో పైసర్వే నంబర్లు ఏ వార్డులోనూ చూపలేదు. ఈ సర్వే నంబర్లలోని భూములకు పక్కా పట్టా ఉండటంతో సుమారు వందకు పైగా ప్లాట్ల రిజిస్ట్రేషన్లు, క్రయవిక్రయాలు జరిగాయి. దశాబ్దాలుగా ఈ సర్వే నంబర్లు ఆసిఫాబాద్ శివారులోనే ఉన్నాయి. విభజన సర్వే చేపట్టిన అధికారులు సదరు సర్వే నంబర్లను మున్సిపాలిటీ పరిధిలో చూపకపోవడం ఎంతవరకు సమంజసమని గుండి రహదారిపై ఉన్న సాయినగర్ కాలనీవాసులు ప్రశ్నిస్తున్నారు. అధికారుల సమన్వయ లోపంతోనే సర్వేలో లోపాలు ఉన్నాయని వాపోతున్నారు. తమ ప్రాంతాన్ని ఆసిఫాబాద్ మున్సిపాలిటీలో కలపాలని శనివారం కమిషనర్ భుజంగరావుకు వినతిపత్రం సైతం సమర్పించారు. అలాగే మున్సిపాలిటీ పరిధిలో లేని సాలెగూడను సైతం ఆసిఫాబాద్‌లో కలిపారు. దీనిపైనా స్థానికులు అభ్యంతరం తెలుపుతున్నారు.



అభ్యంతరం తెలుపుతూ దరఖాస్తు అందిస్తున్న సాయినగర్ కాలనీవాసులు

పారదర్శకత లేదు



ఆసిఫాబాద్ మున్సిపాలిటీ విభజన సర్వేలో పారదర్శకత లేదు. మొక్కుబడిగా సర్వే చేపట్టి ప్రజలను ఇబ్బందులకు గురి చేస్తున్నారు. దశాబ్దాలుగా సర్వే నంబర్లలో నివాసం ఉంటున్న సాయినగర్ ఆసిఫాబాద్ శివారులో ఉన్నా నోటిఫికేషన్‌లో చూపకపోవడం శోచనీయం. సర్వే సరిచేసి వాస్తవాలు నమోదు చేయాలి.

– ఎరుబోతు ప్రదీప్, సాయినగర్

అభ్యంతరాలు తెలపాలి

వార్డుల విభజనపై అభ్యంతరాలుంటే ఈ నెల 20లోగా మున్సిపల్ కార్యాలయంలో రాతపూర్వకంగా దరఖాస్తులు సమర్పించాలి. వచ్చిన దరఖాస్తులను పరిశీలించి పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటాం.

– భుజంగరావు, మున్సిపల్ కమిషనర్



అనుబంధాల రాఖీ..

అన్నాచెల్లెళ్లు, అక్కాతమ్ముళ్ల అనుబంధానికి ప్రతీక రాఖీ. పోగులతో అల్లుకున్న దారం ఎంత బలంగా ఉంటుందో.. అలాగే ప్రేమ, ఆప్యాయతలతో అంతే దృఢంగా తమ అనుబంధాలు కలిసి ఉండాలని చూపిస్తుంది. తన అన్నదమ్ముల కోసం అక్కాచెల్లెళ్లు స్వయంగా ఇళ్లకు వచ్చి, రాఖీలు కట్టి వారిని ఆశీర్వదించే తీరు ఇక్కడ ప్రత్యేకం. అలాగే తమ సోదరీమణులకు వీలుకాకపోతే అన్నదమ్ములే వాళ్లింటికి వెళ్లి మరీ రాఖీ కట్టించుకుంటారు. జిల్లా వ్యాప్తంగా నేడు రక్షాబంధన్ ఘనంగా జరుపుకోనున్నారు.

సర్కారు స్థలం కబ్జా!



అంబేద్కర్ దీక్షా స్థలం సమీపంలో మున్సిపాలిటీ కేటాయించిన స్థలం

- కాగజ్‌నగర్‌లో పునరావాస కేంద్రం కోసం కేటాయింపు
- రూ.కోట్ల విలువైన స్థలంపై అక్రమార్కుల కన్ను
- ప్రహరీ నిర్మించి ఆక్రమణకు యత్నం
- కబ్జాలో మున్సిపల్ పాలకవర్గం, నేతల ప్రమేయం!

సాక్షి, ఆసిఫాబాద్: ఖాళీ స్థలం కన్పించిందా.. అది ప్రభుత్వ స్థలమేనా.. అయితే ఒక చోటా నాయకుడిని ఆశ్రయించడం.. కబ్జా చేసేయడం. ఆ తర్వాత నకిలీ డాక్యుమెంట్లు సృష్టించడం ఎంతో కొంత అధికారుల చేతిలో పెట్టడం.. తాత్కాలిక షెడ్లు వేసుకోవడం.. లేదా ప్రహరీలు నిర్మించడం.. ఇదీ కాగజ్‌నగర్ మున్సిపాలిటీలో జరుగుతున్న కబ్జాల బాగోతం. కాగజ్‌నగర్ పురపాలక సంస్థకు చెందిన దాదాపు 10 గుంటల స్థలం కబ్జాకు గురైంది. రూ.కోట్లు విలువ చేసే మున్సిపాలిటీ స్థలాలకు రక్షణగా నిలవాల్సిన పాలకవర్గ సభ్యులు, అధికార పార్టీ నేతలే కబ్జాకు అండదండలు అందించారన్న ఆరోపణలు ఉన్నాయి. పురపాలక సంస్థకు చెందిన పునరావాస కేంద్ర స్థలం అన్యాక్రాంతంపై అధికారులు మౌనం వహిస్తున్నారు. రూ.కోట్ల విలువ చేసే ఈ స్థలంలో అక్రమ నిర్మాణాలు వెలిసినా కనీస చర్యలు తీసుకోకపోవడం వెనుక అధికార పార్టీ నేతల ఒత్తిళ్లే కారణమని తెలుస్తోంది.

పునరావాస కేంద్రం కోసం కేటాయింపు..

పట్టణంలో నివాసాలు లేని అనాథ పేదలకు నైట్‌షెల్టర్ కోసం ప్రభుత్వం పునరావాస కేంద్రం నిర్మించాలని నిర్ణయించి సర్వే నంబరు 143లో సుమారు 999 చదరపు గజాల స్థలాన్ని కేటాయించింది. అంబేద్కర్ దీక్షా స్థలికి అనుకుని ఉన్న ఖాళీ స్థలంలో పునరావాస కేంద్ర నిర్మాణానికి పురపాలక సంస్థ రూ.50 లక్షల నిధులు మంజూరు చేసింది. ఇందు కోసం టెండర్లు కూడా పిలిచారు. ఐదు నెలల కిందట టెండర్ ప్రక్రియ కూడా పూర్తయింది. కాంట్రాక్టర్‌కు పనులు అప్పగించాల్సి ఉంది. అయితే టెండర్ ప్రక్రియ కొంత ఆలస్యం కావడాన్ని అనుకూలంగా మలచుకున్న కొందరు పాలకవర్గ సభ్యులు విలువైన స్థలంపై కన్నేశారు. అధికారపార్టీ నేతలతోపాటు అధికారులు తమకు అండగా నిలవడంతో కబ్జాకు యత్నించినట్లు తెలుస్తోంది.

చోద్యం చూస్తున్న అధికారులు

కాగజ్‌నగర్ మున్సిపాలిటీ కాంప్లెక్స్ స్థలాన్నే కొందరు ప్రైవేటు వ్యక్తులు ఏకంగా రిజిస్ట్రేషన్ చేసుకున్నప్పటికీ పురపాలక యంత్రాంగం చోద్యం చూస్తుండటంతో అక్రమార్కుల ఆగడాలు శ్రుతి మించిపోతున్నాయి. అధికారుల నిర్లక్ష్య ధోరణితో మున్సిపాలిటీకి చెందిన విలువైన భూములకు రక్షణ లేకుండా పోతోంది. మున్సిపాలిటీ కాంప్లెక్స్ స్థల వ్యవహారం వెలుగులోకి వచ్చిన 24 గంటల్లోనే మరో విలువైన స్థలం కబ్జాకు గురైన విషయం బయటపడింది. అధికారపార్టీ నేతల అండదండలు పుష్కలంగా ఉండటంతో అనాథ నిరుపేదల కోసం కేటాయించిన స్థలాన్ని తమ ఆధీనంలోకి తీసుకోవడమే కాకుండా రెండు అడుగుల మేర ప్రహరీ నిర్మించారు. అధికారులు చూసీచూడనట్లుగా ఉండటానికి మామూళ్లే కారణమని పాలకవర్గంలోని కొందరు సభ్యులు బాహాటంగానే విమర్శిస్తున్నారు. ఇదే విషయంపై వివరణ కోరేందుకు 'సాక్షి' కాగజ్‌నగర్ మున్సిపల్ కమిషనర్ అంజయ్యను ఫోన్‌లో సంప్రదించగా.. 'మీరు పేపర్‌లో రాయండి. చూద్దాం.. చర్యలు తీసుకుంటాం' అని ముక్తసరి సమాధానమిచ్చి ఫోన్ కట్ చేశారు.

మహనీయుల త్యాగాలు చిరస్మరణీయం

- కలెక్టర్ వెంకటేశ్ దోత్రే
- ఘనంగా సర్వాయి పాపన్నగౌడ్ జయంతి



నివాళులర్పిస్తున్న కలెక్టర్ వెంకటేశ్ దోత్రే, అధికారులు, నాయకులు

ఆసిఫాబాద్‌అర్బన్: మహనీయుల త్యాగాలు చిరస్మరణీయమని కలెక్టర్ వెంకటేశ్ దోత్రే అన్నారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ సమావేశ మందిరంలో బీసీ సంక్షేమ జిల్లా అధికారి సజీవన్ అధ్యక్షతన ఆదివారం సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ జయంతి ఘనంగా నిర్వహించారు. పాపన్నగౌడ్ చిత్రపటానికి కలెక్టర్‌తోపాటు అదనపు కలెక్టర్ దీపక్ తివారి, అధికారులు, నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కలెక్టర్ మాట్లాడుతూ తొలిదశ విప్లవకారుడు సర్దార్ పాపన్నగౌడ్ గోల్కొండ కోటను గడగడలాడించారన్నారు. ఆయన స్ఫూర్తితో బీసీలు ముందుకు సాగాలని సూచించారు. అనంతరం గౌడ సంఘం ఆధ్వర్యంలో జిల్లా అధికారులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ అరిగెల నాగేశ్వర్‌రావు, నాయకులు అనిల్‌గౌడ్, కర్నాగౌడ్, ఆంజనేయులుగౌడ్, మనోహర్‌గౌడ్, శంకర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

వనమహోత్సవం.. అంతంతే

- జిల్లాలో 52.69 లక్షల మొక్కలు నాటాలని లక్ష్యం
- 79 శాతం టార్గెట్ పూర్తి
- వెనుకబడిన పలు ప్రభుత్వ శాఖలు



మొక్క నాటి నీళ్లు పోస్తున్న కలెక్టర్ వెంకటేశ్ దోత్రే(ఫైల్)

ఆసిఫాబాద్‌అర్బన్: జిల్లాలో వనమహోత్సవం కార్యక్రమం అంతంతే కొనసాగింది. నిర్దేశించిన లక్ష్యంలో అధికారులు 79శాతం మేర మొక్కలు నాటే కార్యక్రమాన్ని పూర్తి చేశారు. చాలా ప్రభుత్వ శాఖలు మొక్కలు నాటడంలో వెనుకబడ్డాయి. జిల్లాలో 24 శాతం ఉన్న అటవీ ప్రాంతాన్ని 35శాతానికి పెంచడమే లక్ష్యంగా గత ప్రభుత్వం హరితహారం కార్యక్రమాన్ని చేపట్టింది. కాంగ్రెస్ సర్కారు వనమహోత్సవం పేరిట జూలై 1 నుంచి ఆగస్టు 10 వరకు మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టింది. ఇందులో భాగంగా అటవీ ప్రాంతాలతోపాటు ఎవెన్యూ ప్లాంటేషన్లు, ఖాళీ ప్రదేశాల్లో మొక్కలను నాటాలని వివిధ శాఖలకు లక్ష్యం నిర్దేశించారు. ఇందుకోసం జిల్లాలోని గ్రామ పంచాయతీల్లో 53 లక్షలకు పైగా మొక్కలు పెంచారు. ఇందులో గ్రామీణాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన నర్సరీల్లో ఎక్కువ మొక్కలు పెంచగా.. ఆ తర్వాత అటవీశాఖ, ఐటీడీఏ, సింగరేణి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన నర్సరీల్లోనూ అవసరమైన మొక్కలు పెంచారు.

వెనుకబడిన శాఖలు

జిల్లా కలెక్టర్ వెంకటేశ్ ఆదేశాల మేరకు ఆయా శాఖల అధికారులు లక్ష్యం మేరకు మొక్కలు నాటేందుకు ప్రణాళికలు రూపొందించారు. స్వచ్ఛంద సంస్థలు, వ్యాపార, వాణిజ్య, ప్రైవేట్ సంస్థలతోపాటు విద్యార్థులు, గ్రామస్తుల సహకారంతో వనమహోత్సవం కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు చర్యలు చేపట్టారు. అయినా పలు శాఖలు నిర్దేశించిన లక్ష్యాన్ని చేరుకోవడంలో సఫలం కాలేదు. గ్రామీణాభివృద్ధి శాఖకు అధిక మొత్తంలో మొక్కలు నాటాలని లక్ష్యం నిర్దేశించగా.. 96.43శాతం లక్ష్యాన్ని చేరుకుంది. అలాగే విద్యుత్‌శాఖ 139.53శాతంతో అగ్రస్థానంలో నిలిచింది. పశుసంవర్ధక శాఖ, విద్యాశాఖ, దేవాదాయశాఖ, మత్స్య, వైద్యారోగ్య శాఖ, మాధ్యమిక విద్య, కార్మిక, మార్కెట్, మైనింగ్, పీఆర్, ఆర్‌అండ్‌బీ, సింగరేణి, సోషల్ వెల్ఫేర్, ఐటీడీఏ, శిశు సంక్షేమశాఖ, యువజన క్రీడల శాఖలు వందశాతం లక్ష్యాలు పూర్తి చేసి ఆదర్శంగా నిలిచాయి. అలాగే ఇరిగేషన్ శాఖ 97.54, ఇండస్ట్రీస్ 94.34, మున్సిపల్ 69.74, వ్యవసాయశాఖ 66.67, పోలీసుశాఖ 66.67 శాతంతో కాస్త పర్వాలేదనిపించినా.. ఉద్యానవనశాఖ 50, రెవెన్యూ 40, ఆర్‌డబ్ల్యూఎస్ 40, ఎక్సైజ్ 21.05, అటవీశాఖ 4.09 శాతం మొక్కలు నాటి తీవ్ర నిరాశపరిచాయి.

నిరంతర ప్రక్రియ

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన వనమహోత్సవం కార్యక్రమం నిరంతర ప్రక్రియగా కొనసాగుతుంది. జిల్లాలోని నర్సరీల్లో అందుబాటులో ఉన్న మొక్కలను పూర్తిస్థాయిలో నాటేందుకు చర్యలు తీసుకుంటున్నాం. ఎవరైనా ప్రైవేట్ సంస్థలు, వ్యక్తులకు అవసరమైతే మొక్కలు అందిస్తాం. ప్రభుత్వం ఇచ్చిన లక్ష్యాన్ని త్వరలో వందశాతం పూర్తి చేసేందుకు చర్యలు చేపడుతున్నాం.


– బానోత్ దత్తారావు, డీఆర్డీవో

గ్రామీణాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో నాటిన మొక్కలు

మండలం	టార్గెట్	పూర్తి
ఆసిఫాబాద్	2,70,000	2,68,560
బెజ్జూర్	2,60,000	2,42,260
చింతలమానెపల్లి	2,00,000	1,94,120
దహెగాం	2,50,000	2,37,642
జైనూర్	2,00,000	1,96,808
కాగజ్‌నగర్	4,00,000	3,73,773
కెరమెరి	3,00,000	2,85,960
కౌటాల	2,50,000	2,42,650
లింగాపూర్	1,60,000	1,51,256
పెంచికల్‌పేట్	1,60,000	1,55,630
రెబ్బెన	2,50,000	2,31,207
సిర్పూర్(టి)	1,80,000	1,67,806
సిర్పూర్(యూ)	1,60,000	1,52,687
తిర్యాణి	2,30,000	2,28,540
వాంకిడి	2,50,000	2,35,508
మొత్తం	35,20,000	33,64,677

అక్రమాలు కప్పిపుచ్చే యత్నం..!

- తప్పుడు సమాచారంతో బురిడీ కొట్టించేందుకు యత్నిస్తున్న రెబ్బెన పీఏసీఎస్ సిబ్బంది
- బ్యాంకు స్టేట్‌మెంట్ ద్వారా వెలుగులోకి వాస్తవాలు
- ఇంకా తేలని బాధితుల సంఖ్య



సంజీవ్‌కుమార్ పేరుపై రూ.3లక్షల రుణం మంజూరైనట్లు చూపుతున్న బ్యాంకు స్టేట్‌మెంట్

రెబ్బెన(ఆసిఫాబాద్): రెబ్బెన మండల కేంద్రంలోని పీఏసీఎస్ ద్వారా డీసీసీబీ ఆసిఫాబాద్ శాఖలో జరిగిన అవినీతిని సిబ్బంది కప్పిపుచ్చే ప్రయత్నం చేస్తున్నారు. నంబాలకు చెందిన సంజీవ్‌కుమార్ జైస్వాల్ 2003–04లో రూ.5వేల వరకు రెబ్బెన పీఏసీఎస్ ద్వారా రుణాన్ని తీసుకోగా.. ఉమ్మడి రాష్ట్రంలో ఈ రుణం మొత్తం మాఫీ అయింది. సహకార బ్యాంకులో అప్పు తీరగా.. 2021లో పీఏసీఎస్ సీఈవో సంతోష్ నో డ్యూ సర్టిఫికెట్ సైతం జారీ చేశారు. మళ్లీ రెబ్బెన టీజీబీలో రూ.50 వేల రుణం, తన భార్య సంగీత జైస్వాల్ పేరిట అదే బ్యాంకులో రూ.98,000 రుణం తీసుకున్నారు. అయితే ప్రస్తుతం రుణమాఫీ కోసం వ్యవసాయశాఖ అధికారులను సంప్రదించగా వారు జాబితా అందించారు. ఆ జాబితాలో తెలంగాణ గ్రామీణ బ్యాంకు రుణాలతోపాటు అదనంగా డీసీసీబీ ఆసిఫాబాద్ శాఖలో మరో రూ.1,25,426 రుణం ఉన్నట్లు చూపించడంతో కంగుతిన్నాడు. ఈ విషయాన్ని రెబ్బెన పీఏసీఎస్ సీఈవో సంతోష్ దృష్టికి వెళ్లగా.. 'వేరే వారికి మంజూరు చేయాల్సిన రుణం నీ ఖాతాకు జమ చేశాం' అని చెప్పి దాటవేశాడు.

తప్పుడు సమాచారంతో నమ్మించే ప్రయత్నం

రుణాల విషయంపై రాజకీయ పార్టీల నాయకులు, రైతులు సీఈవోను వివరణ కోరినా తప్పుడు సమాచారం అందించి అవినీతిని కప్పిపుచ్చే ప్రయత్నం చేశారు. తొలుత సంజీవ్‌కుమార్ అనే మరో ఖాతాదారుకు సంబంధించిన రుణం బ్యాంకు సిబ్బంది పొరపాటుతో సంజీవ్‌కుమార్ జైస్వాల్ ఖాతాలో జమ చేశారని బుకాయించారు. ఆ తప్పిదం కూడా ఈ మధ్యే జరిగిందని దానిని కూడా సరిచేశామని చెప్పారు. అయితే ఒకరి ఖాతాకు బదిలీ చేయాల్సిన రుణాన్ని మరో ఖాతాకు బదిలీ చేయడం ఎలా సాధ్యమవుతుందని, ఒకవేళా సిబ్బంది తప్పిదంతో సంజీవ్‌కుమార్ జైస్వాల్ ఖాతాలో డబ్బులు జమ చేసినా వాటిని ఎలా డ్రా చేశారని ప్రశ్నించగా.. సీఈవో నుంచి ఎలాంటి సమాధానం లేకుండా పోయింది. సుమారు 50 మంది నిలదీసినా తప్పుడు సమాచారంతో తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేస్తున్నారు.

ఏకంగా రూ.3లక్షలు కాజేసి

రెండు రోజుల వరకు సంజీవ్‌కుమార్ జైస్వాల్ పేరుపై రూ.1,25,426 రుణం మాత్రమే ఉందని అందరూ భావించారు. బాధితుడు డీసీసీబీ ఆసిఫాబాద్ ద్వారా తన అప్పు ఖాతాకు చెందిన స్టేట్‌మెంట్ తీసుకోగా అస్సలు విషయం బయటపడింది. 2016లో ఏకంగా రూ.3లక్షల రుణాన్ని ఖాతాదారుడికి తెలియకుండానే తీసి బ్యాంకు సిబ్బంది, పీఏసీఎస్ సిబ్బంది కాజేశారు. ఏటా ఖాతాదారుడికి సమాచారం ఇవ్వకుండానే రెన్యువల్ చేస్తూ వచ్చారు. గత ప్రభుత్వం రైతు రుణాలు మాఫీ చేయగా అందులో కొంతమొత్తం మాఫీ కాగా.. మిగిలిన మొత్తాన్ని సిబ్బంది చెల్లించినట్లు తెలుస్తోంది. రూ.1,25,426 అప్పు మిగిలి ఉంది. ప్రస్తుత రుణమాఫీలో పూర్తి అప్పు మాఫీ అవుతుందని సహకార బ్యాంకు సిబ్బంది భావించారు. బాధితుడు రుణమాఫీ జాబితా పరిశీలించడంతో అక్రమాలు వెలుగులోకి వచ్చాయి. బాధితుల సంఖ్యపై ఇప్పటికీ స్పష్టత రావడం లేదు. ఈ వ్యవహారంతా జిల్లా కలెక్టర్ దృష్టికి వెళ్లినట్లు సమాచారం.

ప్రభుత్వ భూములను కాపాడాలి

కాగజ్‌నగర్‌రూరల్: పట్టణంలోని విలువైన ప్రభుత్వ భూములను కాపాడాలని సీపీఎం పార్టీ డివిజన్ కమిటీ నాయకులు ముంజం ఆనంద్‌కుమార్ ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. దళారులు, అధికారులు, ప్రజాప్రతినిధులు మూకుమ్మడిగా ప్రభుత్వ భూమిని కాజేస్తున్నట్లు వార్తలు వస్తున్నా జిల్లా కలెక్టర్ కనీసం స్పందించడం లేదని పేర్కొన్నారు. ప్రభుత్వ భూములు కాపాడకుంటే సీపీఎం పార్టీ ఆధ్వర్యంలో పెద్దఎత్తున పోరాటాలు చేస్తామని తెలిపారు. పట్టణంలోని కాంప్లెక్స్‌లు నిర్మించి మున్సిపాలిటీకి ఆదాయం వచ్చేలా చూడాలని ఆయన కోరారు.

క్లుప్తంగా

కుక్కలదాడిలో చుక్కల దుప్పి మృతి



చుక్కల దుప్పి కళేబరం

వేమనపల్లి: ముత్తాపూర్ అటవీ బీట్ పరిధి జిల్లెడ శివారులో ఆదివారం చుక్కల దుప్పి కుక్కలదాడిలో మృతిచెందింది. జిల్లెడ సమీపంలో నీలగిరి తోట పక్కన ఉన్న పత్తి చేలలోకి మేసేందుకు దుప్పి వచ్చింది. కుక్కల వెంబడించి తరమడటంతో ఊరి వైపు పరుగులు తీసింది. తొడ, మెడ వద్ద తీవ్రగాయాలయ్యాయి. గ్రామస్తులు కుశ్న పల్లి రేంజ్ అధికారి దయాకర్‌కు సమాచారం అందించారు. ఎఫ్ఎస్ఓ రాందాస్, ఎఫ్‌బీఓ శంకర్‌కు ఘటన స్థలానికి వెళ్లారు. పశువైద్యాధికారి పవన్‌కుమార్ సిబ్బందితో వెళ్లేసరికి దుప్పి మృతి చెందింది. పంచనామా నిర్వహించి నీలగిరి తోట సమీపంలో కళేబరాన్ని పూడ్చిపెట్టారు.

పిడుగుపడి రైతు మృతి



సిడాం శ్రీనివాస్ మృతదేహం

పెంచికల్‌పేట్: మండలంలోని ఎల్లూర్ గ్రామానికి చెందిన సిడాం శ్రీనివాస్ (45) పిడుగుపాటుకు మృతిచెందాడు. వివరాలు ఇలా ఉన్నాయి.. శ్రీనివాస్.. గ్రామసమీపంలో రెండు ఎకరాలు కౌలు తీసుకుని వ్యవసాయం చేస్తున్నాడు. ఆదివారం మధ్యాహ్నం కూలీలు, కుటుంబ సభ్యులతో కలసి వరినాట్లు వేస్తుండగా ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం కురిసింది. బయటికి వస్తున్న క్రమంలో పిడుగుపాటుకు అక్కడిక్కడే మృతి చెందాడు. సంఘటన స్థలాన్ని ఎస్సై కొమురయ్య పరిశీలించారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. మృతుడికి భార్య కాంతబాయి, కుమారుడుదేవాజీ, కుమార్తె అఖిల ఉన్నారు.

షెడ్డులో అగ్నిప్రమాదం



కాగజ్‌నగర్‌రూరల్: పట్టణంలోని విద్యుత్ శాఖ డీఈ కార్యాలయ ఆవరణలోని ఎలక్ట్రికల్ పవర్ హౌజ్‌లో గల ట్రాన్స్‌ఫార్మర్ మరమ్మతు చేసే షెడ్డు (ఎంఆర్‌టీ)లో ఆదివారం రాత్రి అగ్నిప్రమాదం జరిగింది. ప్రమాదవశాత్తు మంటలు చెలరేగడంతో అధికారులు అగ్నిమాపక సిబ్బందికి సమాచారమిచ్చారు. వారు అక్కడికి చేరుకునే లోపు కాలనీవాసులు మంటలార్పివేశారు.

అమెరికా నుంచి వచ్చి..



నేను మంచిర్యాల నుంచి పెళ్లి తర్వాత ఉద్యోగరిత్యా భర్తతో అమెరికా వెళ్లాను. తమ్ముడు దినేష్‌కు రెండేళ్లుగా నేరుగా రాఖీ కట్టలేదు. పండుగలోపు రాఖీని కొని పంపించేదాన్ని. ఈ ఏడాది ఎలాగైనా రాఖీ కట్టాలని మంచిర్యాలకు వచ్చాను. తమ్ముడికి రాఖీ కట్టేందుకు ఎదురుచూస్తున్నాను.
– చిటుమల్ల దివ్య, కాలిఫోర్నియా, అమెరికా

అన్నయ్యపై ప్రేమతో వస్తున్నా



బెల్లంపల్లి: మాది నెన్నెల మండలం గొల్లపల్లి స్వగ్రామం. నాకు పెళ్లై 9 ఏళ్లు కావస్తోంది. భర్త సాఫ్ట్‌వేర్ ఇంజినీర్. ప్రస్తుతం హైదరాబాద్‌లో జాబ్ చేస్తున్నారు. ఏటా రాఖీ పండుగకు నేను ఎక్కడున్నా సోదరుడు రమేశ్ వద్దకు వచ్చి రాఖీ కట్టడం నాకెంతో ఇష్టం. తోబుట్టువుపై ఉన్న ప్రేమతో పండుగకు ఒకరోజు ముందుగా ఇంటికి వచ్చాను.
– గంద్ర సుమలత, హైదరాబాద్

తమ్ముడికి రాఖీ కట్టడానికి వచ్చాను



తమ్ముడికి రాఖీ కట్టడం ఎంతో ఆనందాన్ని ఇస్తుంది. ప్రస్తుతం నేను హైదరాబాద్‌లో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా పని చేస్తున్నాను. ప్రత్యేకంగా సెలవు తీసుకుని నెన్నెలలో ఇంటికి వచ్చాను. తమ్ముడికి రాఖీ కట్టి పండుగ జరుపుకుంటాం.– చిన్నోజు నిహారిక, నెన్నెల

పండుగకు ఇంటికొస్తా



ప్రస్తుతం నేను వరంగల్ కాకతీయ మెడికల్ కళాశాలలో ఎంబీబీఎస్ ఫైనల్ ఇయర్ చదువుతున్నాను. ఇద్దరు అన్నలు హైదరాబాద్‌లో సాఫ్ట్‌వేర్ జాబ్ చేస్తున్నారు. రాఖీ పండుగ రోజు ఇంటికి వచ్చి పండుగ జరుపుకోవడంలో ఉన్న తృప్తి వెలకట్టలేనిది. – గొల్ల శిరీష, వరంగల్, మాదారం

రక్షా'బంధం'



- అన్నాచెల్లెళ్ల అనుబంధానికి ప్రతీక
- నేడు రాఖీపౌర్ణమి

ఏటా శ్రావణమాసంలో వచ్చేపౌర్ణమి తిథి రోజు రాఖీ జరుపుకుంటారు. శాస్త్రప్రకారం భద్రకాలం ముగిసిన తర్వాత రాఖీ కట్టాలి. ఈ తిథుల విషయంలో భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. శ్రావణమాసం శుక్లపక్షంలో పౌర్ణమి తిథి సోమవారం తెల్లవారుజాము 3:04 గంటలకు ప్రారంభమై రాత్రి 11:55కు ముగుస్తుంది. అయితే ఆ మధ్యలో భద్ర కాలం ఉదయం 5:53 నుంచి మధ్యాహ్నం 1:32 గంటల వరకు సోదరులకు రాఖీ కట్టకూడదని పండితులు చెబుతున్నారు. మిగిలిన సమయంలో రాఖీలు కట్టవచ్చని పేర్కొంటున్నారు.

కెరమెరి(ఆసిఫాబాద్): 'అన్నయ్య సన్నిధి అదే నాకు పెన్నిధి..కనిపించే దైవమే ఆ కనులలో సన్నిధి'అని ఓ చెల్లి తన సోదరుడి గురించి పాట పాడడంలో ఎంతో అర్థం ఉంది. తనను ప్రాణం కంటే మిన్నగా ప్రేమించే అన్నయ్యలంటే ప్రతీ చెల్లికి అభిమానమే. సోదరీసోదరుల ఆత్మీయతకు అద్దం పట్టేదే రక్షా'బంధనం'. ఇంటి ఆడపడుచు మహాలక్ష్మి స్వరూపంగా, పరాశక్తికి ప్రతీకగా భావించే సంస్కృతి మనది. కష్టసుఖాల్లో మేము మీకు అండగా ఉన్నామన్న భరోసాను సోదరులు అక్కా చెల్లెళ్లకు కల్పించడమే రాఖీ బంధం. అన్నాచెల్లెళ్ల ఆత్మీయ చిహ్నానికి, వారి మధ్య అనుబంధానికి ప్రతీకగా నిలిచే రాఖీ పౌర్ణమిని నేడు ఉమ్మడి జిల్లాలో ఘనంగా జరుపుకోనున్నారు. అక్కాచెల్లెళ్లు సోదరులకు రాఖీలు కట్టి మిఠాయి తినిపిస్తారు. తర్వాత వారు కానుకలు ఇస్తారు. ఇది వారి ప్రేమ, అనురాగానికి వారధిగా నిలుస్తుంది. సుదూర ప్రాంతాల్లో ఉన్న వారు ఆత్మీయులకు పోస్టు ద్వారా లేదా ఇతర మార్గాల ద్వారా రాఖీలను పంపారు. భారతీయ ధర్మశాస్త్రాల్లో తెలిపిన రక్షాబంధన్ రోజున సోదరునికి తిలకధారణ గావించి అక్షింతలతో ఆశీర్వదించి రక్షణ కవచాన్ని కడుతుంది. ఇది దేవతారక్షగా కాపాడుతుందని వారి నమ్మకం.

దేవతల కాలం నుంచి..

శ్రీరామునికి కౌసల్య రాఖీ కట్టిందని, రాక్షసుడు విష్ణు భక్తుడైన బలికి మహాలక్ష్మి రాఖీ కట్టి మృత్యువు నుంచి కాపాడిందని, శకుంతల తన గారాల కొడుకు భరతునికి శత్రుభయం లేకుండా తాయిత్తు కట్టిందని కథలు ఉన్నాయి. దేవేంద్రుడు సకల రాక్షసుల మధ్య 12 ఏళ్లు మహాయుద్ధం జరిగింది. ఈ సందర్భంలో రాక్షస రాజు ముల్లోకాలను జయించాడు. పరిస్థితిని గుర్తించిన బృహస్పతి ఇంద్రునికి విజయం కలగాలని ఇంద్రాణితో రక్ష కట్టించాడు. ఇది శ్రావణపౌర్ణమి రోజు వేద పండితుల మంత్రోచ్చారణలో జరిగిందని పురాణాలు చెబుతున్నాయి.

రాజుల కాలం నుంచి..

రాజుల కాలం నుంచి రక్షాబంధం గురించి అనేక కథలు ప్రచారంలో ఉన్నాయి. అలెగ్జాండర్ ప్రేయసి రుక్సానా పురుషోత్తమునికి రక్షా సూత్రం కట్టినందుకే అతన్ని విడిచిపెట్టాడు. హుమాయూన్ చక్రవర్తి రాణి కర్ణావతి రాఖీ పంపించి అతడి రక్షా పొందింది. ఛత్రపతి శివాజీ భవానిదేవి ప్రసాదించిన ఖడ్గాన్ని పొంది వేద ధర్మరక్షణలకు ప్రతిన చేస్తూ రక్షా ధరించారనే కథలు ప్రచారంలో ఉన్నాయి. శ్రావణపౌర్ణమిన రాఖీ కట్టడం వల్ల తల్లీబిడ్డకు, భార్యభర్తలకు తొలి దశ ఏర్పడింది. మలిదశలో సోదరీ సోదరునికి రక్షా కట్టడం జరిగింది. ఈ కాలంలో ప్రతీ మహిళా తనకు పరిచయం ఉన్న పురుషునికి సోదరభావంతో రాఖీ కట్టడం, రాఖీ పంపడం, రాఖీని అందుకున్న పురుషుడు ఆమెను సోదరిగా బహుమతులివ్వడం ఆనవాయితీగా వస్తోంది.

అన్నయ్య అంటే ఇష్టం



మంచిర్యాలటౌన్: మా అన్నయ్య సాయికృష్ణ గౌడ్ అంటే చాలా ఇష్టం. ఉద్యోగ రీత్యా అన్నయ్య ఓ చోట, నేను హైదరాబాద్‌లో బీటెక్ చదువుతున్నా. నేను, అన్నయ్య మంచిర్యాలకు వచ్చాం. పండుగ రోజున అన్నయ్య రాఖీ కడుతాను.
– బొడిగె దీప్తిగౌడ్, బీటెక్ థర్డియర్, మంచిర్యాల

ఎక్కడున్నా తమ్మునికి రాఖీ కట్టుడే



హైదరాబాద్‌లో ప్రైవేటు ఉద్యోగం చేస్తున్నా. చిన్ననాటి నుంచి తమ్ముడు శ్రీచరణ్‌కు రాఖీ కడుతున్నాను. చదువు పూర్తయి, ఉద్యోగంలో చేరినా పండుగకు ఇంటికి వచ్చి, తమ్మునికి రాఖీ కడుతుంటాను. సెలవులు రావడంతో రెండు రోజులు ముందుగానే మంచిర్యాలకు వచ్చాను. – చిలువేరు శ్రీనిజ, మంచిర్యాల

రాఖీ కట్టి యూఎస్ వెళ్లి..



నేనే ఈ ఏడాది బీటెక్ పూర్తిచేశాను. ఎంఎస్ చేసేందుకు అమెరికా వెళ్లాల్సి వచ్చింది. రెండురోజుల ముందే తమ్ముడు చరిత్‌కు రాఖీ కట్టాను. ఈ ఏడాది మాత్రం రాఖీని రెండురోజుల ముందే కట్టి వెళ్లాను.
– ముత్యాల సంహిత, మంచిర్యాల

విడదీయని బంధం



ఆసిఫాబాద్‌అర్బన్: రాఖీ పండుగ సోదర భావాన్ని గుర్తుచేస్తుంది. అన్నాచెల్లెళ్లు, అక్కల బంధం జీవితంలో విడదీయరానిది. ప్రతిఏటా మహారాష్ట్రలోని పుణెలో ఉన్న మా సోదరులకు రాఖీ కడుతాను. అదేవిధంగా అక్కాచెల్లెలు లేనివారికి రాఖీ కట్టడం ఎంతో తృప్తి నిస్తుంది.
– సిద్దెంశెట్టి సుహాసిని, బీజేపీ మహిళా మోర్చా రాష్ట్ర కార్యనిర్వాహక సభ్యురాలు

అన్నాదమ్ములంటే ఓ భరోసా



అమ్మలోని మొదటి అక్షరం..నాన్నలోని రెండవ అక్షరం కలిపితే ఏర్పడేది అన్నయ్య. నేను పోలీసుశాఖలో పనిచేస్తున్నా. కాగజ్‌నగర్‌లో ఉంటున్న తన అన్నయ్యకు రాఖీ కట్టడం ధైర్యాన్నిస్తుంది. రాఖీ పండుగ సంతోషాన్ని మాటల్లో చెప్పలేను. – సునీత, షీటీం హెడ్ కానిస్టేబుల్, ఆసిఫాబాద్

పండగంటే ఇష్టం

ప్రతిఏటా ఆసిఫాబాద్‌లో ఉంటున్న అమ్మానాన్నల సమక్షంలో రాఖీ పండుగను చేసుకుంటాం. అమ్మ చేతి వంటలను ఆస్వాదిస్తాం. అన్నయ్యకు రాఖీ కట్టడంతో మంచి జరుగుతుందని ఎంతో నమ్మకం. నాన్న రంగుల రాఖీలు తీసుకువస్తాడు. ఈ పండుగ అంటే ఇష్టం. – తాటిపల్లి ఈశ్వర్, శ్రేష్ఠ, అన్నాచెల్లెలు, వరంగల్

ఎన్ని పనులున్నా వెళ్తా..

మా ఊరు చెన్నూర్. వివాహం తర్వాత హైదరాబాద్‌లో నివాసం ఉంటున్నాం. ఎన్ని పనులు ఉన్నా సొంత ఊరికి వెళ్తాను. అన్నయ్యకు రాఖీ కట్టి అతను ఇచ్చే కానుకలను భద్రంగా దాచుకుంటాను. స్నేహితులు, బంధువులకు చూపించి సంతోషిస్తాను.
– అభిలాష్‌కు రాఖీ కడుతున్న చెల్లెలు స్వప్న

ఉద్యోగానికి లీవ్ పెట్టి

వృత్తిరీత్యా కరీంనగర్. హైదరాబాద్‌లో ఉంటాం. రాఖీ పండుగ వస్తే కరీంనగర్‌లో ఉన్న చెల్లి బుగ్గారపు హర్షిని వద్దకు వెళ్లి రాఖీ కట్టుకుంటాం. ఎంత పని ఉన్నా లీవ్ పెట్టి అక్కడకు వెళ్తాను. రాఖీ పండుగకు తీసిన ఫొటోలను భద్రంగా దాచుకుంటాను.
– హర్షిని, సంగనబట్ల రేవంత్, భరత్‌కుమార్

సంతానం కలగడం లేదని ఆత్మహత్య



గురువయ్య మృతదేహం

బెల్లంపల్లిరూరల్: సంతానం కలగడం లేదని భర్త (తలలో పేల నివారణకు వాడే మందు) తాగి ఆత్మహత్యకు పాల్పడినట్లు తాళ్లగురిజాల ఎస్సై సీహెచ్ రమేశ్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం..మండలంలోని బుధాకుర్దు పంచాయతీ కాశిరెడ్డిపల్లెకి చెందిన పత్రి గురువయ్య (40) కూలీ పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. 20 ఏళ్ల క్రితం వెంకమ్మతో వివాహం కాగా, సంతానం కలుగలేదు. సంతానం కోసం భార్యభర్తల మధ్య తరచూ గొడవలు జరిగేవి. ఈక్రమంలో ఆదివారం గొడవపడగా భార్యను కొట్టగా కుటుంబీకులు ఆమెను బెల్లంపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఆమెను ఎందుకు కొట్టావని గురువయ్యని కుటుంబీకులు అడిగారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న భార్యను చూసి ఇంటికి వచ్చాడు. మనస్తాపం చెంది పేల మందు తీసుకుని గ్రామశివారులోని మండువా వద్దకు వెళ్లి తాగాడు. భార్యను కొట్టిన నేను బతుకను, పేల మందు తాగానని కుటుంబీకులకు ఫోన్ చేసి చెప్పాడు. వారు అక్కడికి చేరుకుని అతన్ని మంచిర్యాలలోని ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మృతిచెందాడు. గురువయ్య గతంలో ఆత్మహత్యాయత్నం చేసుకున్నాడు. కుటుంబీకుల ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

పురుగుల మందుతాగి మహిళ ఆత్మహత్య



చంద్రక్క (ఫైల్)

దహెగాం: మండలంలోని చిన్నఐనం గ్రామానికి చెందిన జంగిటి చంద్రక్క (50) పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడింది. ఏఎస్సై రమేశ్ కథనం ప్రకారం.. జంగిటి చంద్రక్క గత 9 ఏళ్ల నుంచి మతిస్థిమితం కోల్పోయింది. ఇటీవల హైదరాబాద్ ఆసుపత్రికి తీసుకెళ్లి వైద్యం చేయించారు. అయినా తగ్గకపోవడంతో శనివారం ఉదయం ఇంట్లో ఎవరూ లేని సమయంలో పురుగుల మందు తాగింది. కుటుంబీకులు వచ్చి చూడగా ఆమె వద్ద పురుగుల మందు వాసన రావడంతో చికిత్స నిమిత్తం కాగజ్‌నగర్‌కు తరలించారు. మెరుగైన వైద్యం కోసం మంచిర్యాలకు పంపించారు. చికిత్స పొందుతూ రాత్రి మృతి చెందిందని పేర్కొన్నారు. కుమారుడు మల్లేశ్ ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై తెలిపారు.

క్రీడలతో మానసికోల్లాసం



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న జీఎం సంజీవరెడ్డి

శ్రీరాంపూర్: క్రీడలతో మానసికోల్లాసం కలుగుతుందని శ్రీరాంపూర్ జీఎం బి.సంజీవరెడ్డి తెలిపారు. ఆదివారం ఆర్కే 5 గని ఉద్యోగులకు కృష్ణాకాలనీలోని శాంతి మైదానంలో ఫ్రెండ్లీ క్రికెట్ మ్యాచ్‌లు నిర్వహించారు. ఈ పోటీలను జీఎం ప్రారంభించి మాట్లాడారు. ఉద్యోగుల మధ్య ఇలాంటి పోటీలతో స్నేహసంబంధాలు పెంపొందిస్తాయన్నారు. కార్యక్రమంలో ఓసీపీ పీవో టి.శ్రీనివాస్, ఆర్కే 5 గని మేనేజర్ అబ్దుల్ ఖాదీర్, ఏరియా హెల్త్ ఆఫీసర్ డాక్టర్ లోక్‌నాథ్‌రెడ్డి, వర్క్‌మెన్ ఇన్‌స్పెక్టర్ ప్రవీణ్ పాల్గొన్నారు.

ఏటీఎం ఎయిర్ కంప్రెషర్‌లో మంటలు



మంటలార్పుతున్న స్థానికులు

తాండూర్: మండల కేంద్రంలోని యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఏటీఎం వద్ద ఆదివారం స్వల్ప అగ్నిప్రమాదం జరిగింది. ఏటీఎంకు అమర్చిన ఏసీ కంప్రెషర్‌లో నుంచి మంటలు వచ్చాయి. గమనించిన స్థానికులు వెంటనే నీళ్లు చల్లడంతో మంటలను అదుపులోకి తెచ్చారు. దీంతో ప్రమాదం తప్పింది.

ట్రాన్స్‌ఫార్మర్‌ను ఢీకొట్టిన కారు



దెబ్బతిన్న కారు

తాండూర్: మండలంలోని గోపాల్‌నగర్ వద్ద ఆదివారం ఆదుపుతప్పి ఓ కారు ట్రాన్స్‌ఫార్మర్‌ను ఢీ కొట్టింది. ఎస్సై కిరణ్‌కుమార్ కథనం ప్రకారం..రేపల్లెవాడ గ్రామానికి చెందిన గునిగంటి దేవానంద్ అచ్చులాపూర్‌కు కారులో వెళ్లాడు. తిరిగివస్తుండగా గోపాల్‌నగర్ మూలమలుపు వద్ద కారు అదుపు తప్పి రోడ్డు పక్కన ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌ను ఢీకొట్టింది. ఘటనలో కారు డ్రైవర్ దేవానంద్‌కు స్వల్పగాయాలు కాగా, మరో వ్యక్తి నవీన్ సురక్షితంగా బయటపడ్డాడు. గాయపడిన దేవానంద్‌ను బెల్లంపల్లి ప్రభుత్వ ఆస్పత్రికి పంపించారు. ఈ ఘటనలో కారు ముందు భాగం దెబ్బతింది. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

కనువిందు చేస్తున్న రాఖీ పుష్పాలు



బుద్ధిపల్లిలో రాఖీ పుష్పాలు



గొల్లవాడలో రాఖీ పుష్పం

రాఖీ పుష్పాలు కనువిందు చేస్తున్నాయి. మంచిర్యాల జిల్లా బుద్ధిపల్లి పంచాయతీ పరిధిలోని కొండాపూర్‌కు చెందిన పయ్యావుల రాజేశం, నెన్నెలలోని గొల్లవాడలో దూపం చందు, స్వాతి మొండి, తోట ఆశన్న ఇళ్ల ముందు ఉన్న చెట్లకు రాఖీ పుష్పాలు వికసించాయి. వీటిని పంచపాండవుల పుష్పాలు అని అంటారని స్థానికులు తెలిపారు. ఈ పుష్పం చుట్టూ నీలిరంగు రేకులు 101 ఉండగా మధ్యలో తెల్లటి వర్ణంలో ఉండే కేశనాలికలు ఐదు ఉన్నాయి. దీంతో ప్రజలు వాటిని దైవపుష్పాలుగా భావిస్తారని పెద్దలు అంటున్నారు.
– మంచిర్యాలరూరల్(హాజీపూర్)/నెన్నెల

అ'పూర్వ' సమ్మేళనం



ఉపాధ్యాయులతో పూర్వ విద్యార్థులు

మంచిర్యాలఅర్బన్: గర్మిళ్ల ప్రభుత్వ హైస్కూల్‌లో 2003–04 బ్యాచ్ పదో తరగతి పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఆదివారం నిర్వహించారు. ఒకరికొకరు ఆత్మీయ ఆలింగనం అనంతరం యోగాక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. పాత జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. రోజంతా సంతోషంగా గడిపారు. విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులు పీవీఎన్ చారి, వెంకటేశ్వర్లు, రాజగోపాల్, వామనమూర్తి, భీంరావు, శ్రీనివాస్, మధుకర్‌లను సన్మానించారు. కార్యక్రమ నిర్వాహకులు రవి, అశోక్, భీంరావు, సతీశ్, సంధ్యారాణి, సరిత, మనోజ్, రాయమల్లు తదితరులు పాల్గొన్నారు.

'రుణమాఫీ' విషయంలో గొడవ

బెజ్జూర్: రుణమాఫీ విషయంలో కుటుంబీకుల మధ్య జరిగిన గొడవలో ఇద్దరికి గాయాలయ్యాయి.. వివరాలు ఇలా ఉన్నాయి.. మండలంలోని లంబడిగూడ గ్రామానికి చెందిన సపావత్ భురి నాయక్‌కు నలుగురు కుమారులు ఉన్నారు. ఒక కుమారుడు మృతి చెందగా, సంతోష్, మహేష్ ఇద్దరు తండ్రి వద్ద ఉంటున్నారు. మరో కుమారుడు విలాస్ భార్యతో వేరుగా ఉంటున్నాడు. భురి నాయక్ పేరిట భూమి ఉంది. బెజ్జూర్ బ్యాంకులో రుణం తీసుకున్నాడు. రుణమాఫీలో వాటా ఇవ్వాలని విలాస్ శనివారం రాత్రి తండ్రిని అడిగాడు. ఇంకా కాలేదని తెలపడంతో వారిద్దరి మధ్య వాగ్వాదం జరిగింది. విలాస్‌తోపాటు భార్య శారదకు గాయాలయ్యాయి. వారిని కాగజ్‌నగర్ ఆస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి కరీంనగర్ ఆస్పత్రికి తీసుకెళ్లారు. విలాస్ భార్య శారద ఫిర్యాదుతో తండ్రి, ఇద్దరు కుమారులపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై విక్రమ్ తెలిపారు.

జ్ఞాపకాలు పదిలం..

ఒక్క ఫొటో ఎన్నో మధుర జ్ఞాపకాలు కదలాడుతాయి. కాలం గిర్రున తిరుగుతున్నప్పటికీ చిత్రం చూడగానే గత స్మృతులు మనసులో మెదలుతాయి. కాలానుగుణంగా ప్రకృతిలో చోటు చేసుకునే మార్పులు బంధించి పదిలంగా దాచుకొని మళ్లీమళ్లీ చూసుకునే అవకాశం. ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవం సందర్భంగా ఆదిలాబాద్, నిర్మల్ సాక్షి ఫొటోగ్రాఫర్లు తీసిన చిత్రాలు.
– సాక్షి ఫొటోగ్రాఫర్ ఆదిలాబాద్/నిర్మల్



ఒంపుసొంపుల జాతీయ రహదారి..దేవాపూర్ చెక్‌పోస్టు ప్రాంతంలో..



మహబూబ్ ఘాట్ రోడ్డు ఏరియల్ వ్యూ



ఆదిలాబాద్ జిల్లా సలాయిగూడలో ఆదివాసీల జీవన చిత్రం